క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

మద్దిలపాలెం : ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాల్తేరు డిపోలో శుక్రవారం మెగా సామూహిక రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి బి.నీలకంఠం తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా ఏపీఎస్ఆర్టీసీ వీసీ,ఎండీ సీహెచ్. ద్వారకా తిరుమలరావు హాజరుకానున్నారన్నారు. అలాగే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు సారథ్యంలో జరగనుందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, గ్యారేజ్ ఉద్యోగులుపాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

23న కళాభారతిలో శ్రీరామ జననం హరికథ గానం

మద్దిలపాలెం : విశాఖ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ కళాభారతి ఆహ్వానం మేరకు ఈనెల 23వ తేదీన మద్దిపాలెం కళాభారతి ఆడిటోరియంలో సాయంత్ర 6 గంటలకు కాళ్ల నిర్మలచే శ్రీరామ జననం హరికథా గానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకుడు వీఎండీఏ కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు పేర్కొన్నారు.

ఎంవీపీలో పెన్షన్‌దారుల సమావేశం

ఎంవీపీకాలనీ: జిల్లా సంక్షేమ శాఖల పూర్వ ఉద్యోగుల పెన్షన్ దారుల సంఘం సమావేశం లో గురువారం ఎంవీపీ కాలనీ సాంఘిక సంక్షేమశాఖ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో పెద్ద ఎత్తున సభ్యులు హాజరై పలు అంశాలపై చర్చించారు. పెన్షన్ పొందే క్రమంలో ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి నెల సకాలంలో బ్యాంకు ఖాతాలో పెన్షన్ జమ అయ్యేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ దిశగా సంఘ ప్రతినిధులు కృషి చేయాలని సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావును సభ్యులు కోరారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పెన్షన్ దారులు వారి వారి సమస్యలను సంఘ ప్రతినిధులకు వివరించారు.

డ్రైనేజీకి మరమ్మతులు



డ్రైనేజీ పనులను పర్యవేక్షిస్తున్న గోవింద్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22 వార్డులోని శివాజీ పాలెం సవేరా ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టారు. తరచూ డ్రైనేజీ పొంగేదని, దీంతో స్థానికులు ఇబ్బంది పడేవారని వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు.. పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతాల గోవింద్ దృష్టికి తీసుకొని వెళ్లారు. దీనిపై స్పందించిన గోవింద జీవీఎంసీ అధికారులతో మాట్లాడడంతో మరమ్మతులు చేపట్టారు. పనులను నాయకులు స్వాతి వెంకటేష్‌తో కలిసి గోవింద పర్యవేక్షించారు.

పార్లమెంట్‌లో బీసీల డిమాండ్లను ప్రస్తావించాలి

బీచ్‌రోడ్డు: బీసీల డిమాండ్‌ల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు వైఎస్సార్‌సీపీ బాటలో నడవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వ వేణుమాధవ్ అన్నారు. పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ల సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆయన గురువారం ఢిల్లీ పయానమయ్యారు. చట్ట సభల్లో బీసీల రిజర్వేషన్లు, జనగణనలో కుల గణన, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ, ఉద్యోగుల ప్రమోషన్లో రిజర్వేషన్, బీసీ క్రిమిలేయర్ ఎత్తివేత అంశాలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలన్నారు. ఇప్పటికే గత పార్లమెంట్ సమావేశాల్లో వైఎస్సార్ సీపీ తరపున రాజ్య సభ ఫ్లోర్ లీడర్ విజయసాయిరెడ్డి ప్రస్తావించారని గుర్తు చేశారు. బీసీ డిమాండ్ల పరిష్కారం కోసం జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు.

వ్యర్థాలతో వావ్



టైర్ల వ్యర్థాలతో తీర్చిదిద్దిన క్రీడా పరికరాలు

- లాసన్స్ బే పార్కుకు.. థ్రిల్లింగ్ లుక్
- టైర్ల వ్యర్థాలతో వినూత్నంగా ఆధునికీకరించిన జీవీఎంసీ

ఎంవీపీకాలనీ : సాగర తీరాన్ని ఆనుకొని ఉన్న లాసన్స్ బే కాలనీ పార్కును జీవీఎంసీ ఆధునికీకరించి తీరుపై సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. వేస్టు టు వండర్స్ పేరిట జీవీఎంసీ ఇటీవల ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసింది. దీంతో ప్రస్తుతం ప్రాంగణాలు సందర్శకులకు అత్యంత థ్రిల్లింగ్ పంచుతున్నాయి. కొంతకాలంగా ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలు శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక చిన్నారులకు ఆహ్లాదం కరువయ్యింది. దీంతో స్థానికుల వినతుల మేరకు రంగంలోకి దిగిన జీవీఎంసీ ఈ పార్కుకు కొత్తరూపు తెచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పార్కును వినూత్నంగా తీర్చిదిద్దడంతో అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు పరికరాలతో పిల్లలు సందడి చేస్తున్నారు.

వేస్ట్ టు వండర్ పేరుతో..

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంలో భాగం



గా జీవీఎంసీ పలు పార్కులను ఆధునికీకరిస్తోంది. ఇందులో భాగంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచనల మేరకు వేస్ట్ టు వండర్స్ కాన్సెప్ట్‌తో లాసన్స్ బే పార్కును వినూత్నంగా తీర్చిదిద్దారు. స్వచ్ఛ సర్వేక్షన్ ద్వారా సేకరించిన వ్యర్థాలను, టైర్లను వినియోగించి ఆహ్లాదం పంచే విధంగా





ఈ పార్కులో క్రీడా ప్రాంగాణాలను ఇక్కడ తీర్చిదిద్దారు. రెండు క్రీడా ప్రాంగణాలుగా సౌకర్యాలు కల్పించారు. కేవలం రూ.16.5 లక్షల ఖర్చుతో ఈ ప్రాంగణాలు రూపుదిద్దుకున్నాయి. ఇందు కోసం 1,900 కేజీల పనికిరాని టైర్లను వినియోగించారు. వాటిని సరికొత్త రంగులతో కొత్త హంగులు అద్ది జారుడు బల్లలు, ట్రెక్కింగ్ వాల్స్, ఎడ్వెంచర్ ఏరియా, ఊయలతో పాటు పలు రకాల క్రీడాకృతులను తీర్చిదిద్దారు. దీంతో అవి పిల్లలతో పాటు పెద్దలకు అవి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

కేజీహెచ్ వన్‌స్టాప్ సెంటర్ పరిశీలన



డాక్టర్ రామారెడ్డితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మహారాణిపేట : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ గురువారం కేజీహెచ్‌లో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడున్న పిల్లలతో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ మానసిక వైద్యశాలని సందర్శించారు. అక్కడి పరిస్థితులను సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎంవీపీలో ఉన్న గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికలతో మాట్లాడారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(అమరావతి) ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేశారు. అన్ని వసతులు, సౌకర్యాలపై సంబంధిత సిబ్బందితో మాట్లాడి న్యాయసేవల ఉపయోగం కోసం వివరించి, న్యాయసేవలను ఉచితంగా పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

12వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్‌లో కాలువల నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి నెహ్రూనగర్‌లో గురువారం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో కాలువలు నిర్మాణం కోసం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి వెళ్లినప్పుడు స్థానికులు తెలిపిన సమస్యలు పరిష్కారంలో భాగంగా ఈ కాలనీలో కాలువలు నిర్మాణ చేపడుతున్నామన్నారు. వీటి కోసం రూ 15.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, శ్రీనివాస్, మోహన్, సుజాత, సురేష్, సంతోష్, రాజులమ్మ, సూర్యారావు, ఈగల బుజ్జి, కనకరాజు పాల్గొన్నారు.

గోతులు పూడ్చండి

శంకుస్థాపన కోసం వచ్చిన వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ అక్కరమాని రోహిణిని స్థానిక దుర్గానగర్ మహిళలు కలిశారు. తమ కాలనీలో నెల రోజుల క్రితం కాలువలు పనుల కోసం ఇళ్ల ముందు తవ్వేసి వదిలేశారని, ఎవ్వరూ పట్టించుకోలేదని, తక్షణం పనులు జరిపించాలని కోరారు. స్పందించిన విజయనిర్మల సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పనులు జరిపిస్తామని హామీ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసి

ఆరిలోవ: మలేరియా నివారణపై పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో బాలాజీనగర్, ఆరిలోవ కాలనీలలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. ఆయా ఆస్పత్రులలో ల్యాబరేటరీలు తనిఖీ చేశారు. లాబరేటరీలలో వినియోగిస్తున్న పరికరాలు, మలేరియా, డెంగ్యూ పరీక్షలలో నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. వాటి నివారణ దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. దీని కోసం ప్రణాళికాబద్ధమైన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటికి వెళ్లి లార్వాను గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఇంటింటికీ ఫీవర్ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. వలంటీర్లకు ఆశా వర్కర్లు సహకరించాలన్నారు. ఈ పర్యటనలో మలేరియా విభాగం అధికారి నగేష్, పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

28వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాలను వివరిస్తున్న విజయనిర్మల

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో గురువారం వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గడపగడపకు వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఆ నిధులతో సచివాలయంలోని రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు మరమ్మతులు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇంచార్జి పల్లా దుర్గారావు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

బీచ్‌రోడ్డు: గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు యూనిఎక్స్‌పర్ట్స్ ప్రతినిధి ఇంతియాజ్ బన్నూరు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్యాలో ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనున్నామన్నారు. ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ యూనివర్సిటీలను ఔత్సాహిక విద్యార్థులను ఒకే తాటిపైకి తీసుకొవచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫెయిర్‌లో అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, కెనడా, దుబాయ్, జర్మనీ వంటి 10 దేశాలకు చెందిన యూనివర్సిటీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం https://unixperts.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

షాదీఖానా నిర్మాణాన్ని నిలిపివేయాలి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం ముస్తఫాకాలనీలో జీవీఎంసీ ఆస్పత్రి ఆవరణలో షాదీఖానా నిర్మాణాన్ని నిలిపివేయాలని తూర్పు నియోజకవర్గం బీజేపీ నాయకులు గురువారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం అందజేశారు. జీవీఎంసీ ఆస్పత్రి ఆవరణలో ముస్లింల కోసం షాదీఖానా నిర్మించడంపై అభ్యంతరం తెలిపారు. ఆస్పత్రికి 100 మీటర్ల దూరంలో ప్రభుత్వం నిర్మించిన షాదీఖానా ఉందన్నారు. దాంతో పాటు మళ్లీ కొత్తగా ఇదే ప్రాంతంలో మరో షాదీఖానా నిర్మించడం అవసరం లేదని ఎస్.ఆర్.ఎల్.ఎన్ మురళి, ధార్మిక సెల్ రాష్ట్ర సభ్యుడు కె.విజయశంకర్ ఫణీంద్ర, వెంకటేశ్వరరావు, సన్యాసిరావు, మాధవీలత తదితరు పాల్గొన్నారు.

సిరిధాన్యాల చిత్రపటం బహూకరణ



వీసీ ప్రసాద రెడ్డికి సిరిధాన్యాల చిత్రపటం బహూకరిస్తున్న విజయ్ కుమార్

ఏయూక్యాంపస్: సిరిధాన్యాలతో తీర్చిదిద్దిన చిత్రపటాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డికి నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ బహూకరించారు. గురువారం వీసీ ప్రసాద రెడ్డిని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి చిత్రపటాన్ని అందజేశారు. 2023 సంవత్సరాన్ని యుఎన్ అంతర్జాతీయ సిరిధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. దీనిని విస్తృతంగా ప్రజల్లోనికి తీసుకువెళ్లడానికి, చిత్రకళను మాధ్యమంగా ఉపయోగించి ప్రముఖుల చిత్రపటాలను తీర్చిదిద్దడం జరుగుతోందని విజయ్ కుమార్ తెలిపారు. సిరిధాన్యాలను ఉపయోగించి చిత్రపటాలలను తయారు చేయడాన్ని వీసీ ప్రసాద రెడ్డి ప్రశంసించారు.

పార్కుకు తాళం వేయవద్దు

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డులో టి.ఐ.సి పాయింట్ వద్ద మయూర్‌నగర్ పార్కునకు తాళం వేయవద్దని ఆరిలోవ సీఐ సోమశేఖర్ స్థానిక పెద్దలకు సూచించారు. పార్కులో కొందరు ఆయతాయిలు గంజాయి పీల్చుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీఐ సోమశేఖర్‌కు,కార్పొరేటర్ అక్కరమాని రోహిణికి స్థానికుల ఫిర్యాదు చేశారు. దీంతో వారిరువురు గురువారం పార్కును సందర్శించారు. పార్కు గేటుకు తాళం వేసి ఉండటం గమనించిన సీఐ సోమశేఖర్ స్థానిక పెద్దలను నిలదీశారు. పార్కులోకి స్థానికులు ప్రవేశించకుండా తాళం వేసిన పెద్దలను మందలించారు. పార్కుకు తాళం వేయవద్దని హెచ్చరించారు. తాళం తెరిచి ఉంటే పిల్లలు ఆటల ఆడుకోవడానికి, పెద్దలు విశ్రాంతి తీసుకోవడానికి పార్కుకు వస్తారన్నారు. అలాంటప్పుడు ఆకతాయిలు, గంజాయి తాగే వారు ఎవ్వరూ రావడానికి వీలుపడదన్నారు. పగలంతా తాళం వేసి రాత్రులు దీన్ని మూసేయవచ్చని సూచించారు.

మద్దిలపాలెం కూడలిలో ముమ్మర తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న మూడో పట్టణ పోలీసులు

మద్దిలపాలెం : నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు పోలీస్ విజువలింగ్‌లో భాగంగా మూడో పట్టణ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేశారు. గురువారం సాయంత్రం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ముఖద్వారం వద్ద ఎస్.ఐ.డి.రాంబాబుతో కూడిన బృందం ద్విచక్ర వాహనాలు రికార్డులు, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారిని గుర్తించి జరిమానాలు విధించారు.

యువతతోనే సామాజిక మార్పు



సదస్సును ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: సామాజిక మార్పునకు వాహకాలుగా యువతరం నిలవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఏయూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) నిర్వహించిన 'లెర్నింగ్ ఇమ్ప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం'ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలపై యువతకు అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో సమాజ సమస్యలకు వీరు పరిష్కారాలను చూపడం వీలవుతుందన్నారు. డిగ్రీ విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్‌ప్రాజెక్టులో భాగస్వాములు కావడం శుభపరిణామమన్నారు. తద్వారా విద్యార్థికి, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీడీఈ పథకం కార్యదర్శి, సీఈవో ఆచార్య ఎం.ఎల్.ఎస్ దేవ కుమార్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో నిలుస్తోందన్నారు. సామాజిక సేవ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రేరణ మిత్రలుగా డిగ్రీ విద్యార్థులు వ్యవహరించాలని సూచించారు. విద్యలో ప్రమాణాలు పెంచడానికి వీరు దోహదపడాలని సూచించారు.

ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యా సంస్థలో అడుగిడిన సమయంలో, విద్యాభ్యాసం పూర్తిచేసి వెళ్లే సమయంలో విద్యార్థి జ్ఞాన వృద్ధిలో స్పష్టమైన ప్రగతిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. యూనిసెఫ్ కన్సల్టెంట్ టి.సుదర్శన్ మాట్లాడుతూ ప్రత్యేకమైన మెటీరియల్స్, మాడ్యూల్స్‌ను తయారు చేసిన విధానం, ప్రేరణ యాప్ ఉపయోగించే విధానాలను వివరించారు. ఏయూ బీసీడీఈ సమన్వయకర్త ఆచార్య ఎన్.ఏ.డి పాల్ మాట్లాడుతూ రాష్ట్ర యువతను సమాజంలో అనుసంధానం చేసి, వారి వ్యక్తిత్వాన్ని, అవగాహనను పెంపొందిస్తూ సమాజ అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి ఆర్.అప్పారావు, ఏపీ సమగ్ర శిక్ష స్టేట్ అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ కల్పన శైల, అసిస్టెంట్ ఏఎంఓ లక్ష్మి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏయూ అనుబంధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

జీవనంపై సామాజిక మాధ్యమాల ప్రభావం



సదస్సులో ప్రసంగిస్తున్న ఆచార్య డి.వి.ఆర్.మూర్తి

ఏయూక్యాంపస్: మానవ జీవనాన్ని సామాజిక మాధ్యమాలు ప్రభావితం చేస్తున్నాయని ఏయూ జర్నలిజం విభాగం ఆచార్యులు డి.వి.ఆర్ మూర్తి అన్నారు. ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన మాస్ మీడియా ప్రభావంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు మనిషి సమయాన్ని, కాలాన్ని మాస్ మీడియా నిర్ణయిస్తున్న విధానం వివరించారు.గతంలో టీవీ సమూహంగా కుటుంబమంతా వీక్షించే మాధ్యమంగా ఉండేదని, నేడు ఇది వ్యక్తిగతంగా చూసే మాధ్యమంగా మారిపోయిందన్నారు. సమాచారం ఇచ్చే స్థాయి నుంచి ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించే దిశగా మాస్ మీడియా రూపాంతరం చెందిన విధానాన్ని వివరించారు. వార్తలు, ప్రకటనలు, ప్రసంగాలు వంటివి మనల్ని ఎంతవరకు ప్రభావితం చేస్తున్నాయి అనే అంశాలను పలు ఉదాహరణలతో వివరించారు. నూతన వస్తువులను కొనుగోలు చేసే విధంగా మనల్ని ప్రేరేపించే ప్రకటనలు, వారి వ్యూహాలను సోదాహరణంగా వివరివించారు. చిన్నారులకు ఎటువంటి కంటెంట్‌ను వీక్షించాలి, సెన్సార్ వంటి అంశాలను తెలియజేశారు. సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారుతున్న విధానం వివరించారు.

నైపుణ్యాల వృద్ధితోనే రాణింపు



ప్రసంగిస్తున్న శ్రీనివాస్

ఏయూక్యాంపస్: మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎన్.శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో 'కెరియర్ ఆపర్చునిటీస్ ఇన్ ఫైనాన్స్' అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుళ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులు, నూతన అంశాలను ఆకళింపు చేసుకోవడం, అవగాహన పొందడంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. పన్ను విధానం తరచూ మార్పులు చెందుతున్నాయని, వీటిపై లోతైన అవగాహన అవసరమన్నారు. ప్రతీ విద్యార్థి సమాంతరంగా మరొక ఉన్నత విద్య కోర్సును అభ్యసించే ప్రయత్నం చేయాలని సూచించారు. అదే విధంగా కంప్యూటర్ పరిజ్ఞానం, టాలీ వంటి వాణిజ్యపరమైన సాఫ్ట్‌వేర్‌లను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ ఏ.ప్రభాకర్, డాక్టర్ బి.సుబ్బయ్య, పరిశోధకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాన వక్త శ్రీనివాస్‌ను సత్కరించారు.

డీసీఎంఎస్ పరిశోధకులకు వర్సిటీ డాక్టరేట్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి కె.రమేష్ బాబుకు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు జాలాది రవి పర్యవేక్షణలో 'ఫేక్టర్స్ ఇన్ఫ్లులెన్సింగ్ ఇన్వెస్ట్‌మెంట్ డెసిషన్స్–ఏ స్టడీ ఆన్ ద పర్సెప్షన్స్ ఆఫ్ ఇన్వెస్టర్స్ ఇన్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్స్, ఆంధ్రప్రదేశ్ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను రమేష్ బాబు స్వీకరించారు. విభాగ పరిశోధక విద్యార్థిని డి.అనూహ్యకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఆచార్య బి.మోహన వెంకట రామ్ పర్యవేక్షణలో' ఎంప్లాయి ఎంగేజ్‌మెంట్ ఇన్ హెల్త్ కేర్ ఇండస్ట్రీ ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు కింగ్ జార్జ్ హాస్పిటల్, విశాఖపట్నం'అంశంపై జరిపిన పరిశోధకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను అనూహ్య స్వీకరించారు.

అప్పన్నకు నిత్య కల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేంప చేసికల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాలను అందజేశారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీ హోమంలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.